రహదారులపై వరి కుప్పలు
ప్రమాదాలకు నిలయాలు

ఈనాడు, సిరిసిల్ల

పంట ఉత్పత్తులు ఆరబెట్టేందుకు కల్లాలు, కొనుగోలు కేంద్రాలు లేక ఏటా వానాకాలం, యాసంగి సీజన్లలో కర్షకులకు కష్టాలు తప్పడం లేదు. గత్యంతరం లేక రహదారులపైనే ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. దీంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. సిరిసిల్ల పురపాలిక పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు స్థలాలు లేక విక్రయాలు పూర్తయ్యేవరకు రహదారిపైన ఆరబెడుతూ అవస్థలు పడుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఒక్కొక్కటిగా ప్రారంభమవుతున్నాయి. గ్రామాల్లోనూ వరికోతలు ఊపందుకున్నాయి. సిరిసిల్ల పురపాలికలో రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూరు, సర్దాపూర్‌లో విస్తారంగా వరిసాగైంది. ఇక్కడ మెప్మా, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తారు. కోతలు ప్రారంభమవడంతో రైతులు సిరిసిల్ల-కామారెడ్డి రెండో బాహ్యవలయ రహదారిపై ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ఇక్కడ ప్రతి సీజన్‌లో ఈ కేంద్రాల్లో 54 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని రైతులు విక్రయిస్తారు.


బాహ్యవలయ రహదారిపై ఆరబోసిన ధాన్యం


వాహనాలు వెళ్లకుండా అడ్డుగా పెట్టిన బారికేడ్లు

- వరి కోతలు పూర్తయ్యాక రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చి బాహ్యవలయ రహదారిపైకి తీసుకొస్తున్నారు. ధాన్యం ఆరబోతకు కల్లాలు లేకపోవడంతో రహదారినే కొనుగోలు కేంద్రాలుగా వాడుతున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటికీ ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. కొనుగోలు కేంద్రాలకు స్థలాలు లేక.. ధాన్యం ఆరబోత ఇబ్బందులతో ఆయా గ్రామాల్లో చాలా మంది రైతులు ఇప్పటికే రైస్ మిల్లులకు విక్రయిస్తున్నారు. క్వింటా సాధారణ రకం ధాన్యానికి రూ.2,300, ఏ గ్రేడు రకానికి రూ.2,320 మద్దతు ధర ఉంది. సన్నధాన్యానికి రూ.500 బోనస్ కలుపుకొని రూ.2,820 ధర లభిస్తుంది. కానీ రైతులు క్వింటా రూ.1900లకు విక్రయించి నష్టపోతున్నారు.
- సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్దాపూర్‌లో ఉంది. ఇక్కడ ఇరవై వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాంలు ఉన్నాయి. పంట ఉత్పత్తుల విక్రయాలకు ప్రత్యేకంగా షెడ్లు కూడా ఉన్నాయి. పెద్దూరు, సర్దాపూర్ గ్రామాలకు మాత్రమే దగ్గరగా ఉంటుంది. మిగతా గ్రామాలకు చాలా దూరంగా ఉంటుంది. రైతులు పంట ఉత్పత్తుల రవాణా భారంతో ఇక్కడికి తీసుకురాలేని పరిస్థితి ఏర్పడింది.

ఇవీ సంఘటనలు

- సిరిసిల్ల పట్టణానికి చెందిన రాజశేఖర్ (27) ఈ నెల 13న ద్విచక్రవాహనంపై సిరిసిల్ల-కామారెడ్డి బాహ్యవలయ రహదారి నుంచి సిరిసిల్లకు వస్తున్నాడు. చిన్నబోనాల సమీపంలో ధాన్యం కుప్పను ఢీకొట్టిన వాహనం అదుపు తప్పి కింద పడటంతో తలకు తీవ్రగాయమైంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 17న మృతి చెందాడు.
- గతేడాది వానాకాలం ధాన్యం కొనుగోలు సీజన్‌లో పెద్దూరు రెండు పడక గదుల ఇళ్ల సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు వరికుప్పను ఢీకొని కింద పడటంతో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు.
- 2022 యాసంగి సీజన్‌లో ఒడిశా వలస కార్మికుడు ద్విచక్రవాహనంపై వస్తూ రగుడు వద్ద వరికుప్పను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు.

కేంద్రాలకు స్థలాలు లేక...

చిన్నబోనాల, పెద్దబోనాల, ముష్టిపల్లిలో మెప్మా, పెద్దూరు, సర్దాపూర్‌లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తారు. వీటిలో ఎక్కడా కొనుగోలు కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వ, సొంత స్థలాలు లేవు. ఏటా రెండు సీజన్లలో నాలుగు నెలలు సిరిసిల్ల-కామారెడ్డి బాహ్యవలయ రహదారిపైనే విక్రయాలు జరగాలి. కొనుగోలు కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వ స్థలం చూపించాలని ఆయా గ్రామాల్లోని మహిళా సంఘాలు, రైతులు అధికారులను పలుమార్లు కోరారు. వీరి వినతులు బుట్టదాఖలయ్యాయి.

స్థలం చూపించాలని అడిగాం

కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వ స్థలం చూపించాలని ఇది వరకు రెవెన్యూ అధికారులను కోరాం. ప్రభుత్వ స్థలం చూపిస్తే అక్కడే కొనుగోలు కేంద్రాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తాం. **- మీర్జా ఫసహత్ ఆలీ బేగ్, మెప్మా పీడీ**

తీరనున్న దత్తాత్రేయ స్వామి భక్తుల ఇబ్బందులు

కేంద్ర సహాయ మంత్రి చొరవతో అందుబాటులోకి బోటు

న్యూస్‌టుడే, బోయినపల్లి

రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయం బ్యాక్ వాటర్‌లో దత్తాత్రేయ స్వామి గుట్ట చుట్టూ పచ్చదనం సంతరించుకొని ద్వీపంలా చూపరులను ఆకట్టుకుంటుంది. అయితే గుట్టపైకి వెళ్లడానికి భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ బోటు ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు తీరనున్నాయి.

బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామం రాజరాజేశ్వర జలాశయ నిర్మాణంలో ముంపునకు గురైంది. గ్రామంలోని గుట్టపై దత్తాత్రేయ స్వామి ఆలయం ఉంది. జలాశయంలో ముంపునకు గురికాక ముందు రోజూ ఆలయంలో నిత్య పూజలు, అభిషేకాలు నిర్వహించేవారు. ప్రతి పౌర్ణమి రోజు సామూహిక సత్యదత్త వ్రతాలు భక్తులు ఆచరించేవారు. ఏటా డిసెంబరులో మూడు రోజులు జయంత్యుత్సవాలు వైభవంగా జరుగుతుండేవి. జలాశయంలో నీటి నిల్వతో నిర్వాసితులకు తమకు కేటాయించిన ఆర్అండ్ ఆర్ కాలనీకి తరలి వెళ్లారు. గుట్ట చుట్టూ బ్యాక్ వాటర్ చేరింది. దీంతో గుట్టపై నిత్య పూజలు, అభిషేకాలు నిలిచిపోయాయి. జయంత్యుత్సవాల సందర్భంగా పర్యాటకశాఖ నుంచి బోట్లు తెప్పించడంతో అర్చకులు గుట్టపైకి మూడు రోజులు వెళ్లి పూజలు నిర్వహించగా, భక్తులు వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు.


జలాశయం బ్యాక్‌వాటర్‌లో బోటు

ఎంపీ హామీతో...

గత ఏడాది జరిగిన జయంత్యుత్సవాల సందర్భంగా స్వామివారిని ఎంపీ హోదాలో ప్రస్తుత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల ఇబ్బందులను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఆయనకు వివరించారు. శాశ్వతంగా బోటు ఏర్పాటు కోసం నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈమేరకు ఎంపీ నిధులు రూ.10.68 లక్షలు కేటాయించారు. దీంతో హైదరాబాద్‌లో బోటు తయారు చేయించి తీసుకొచ్చారు. త్వరలోనే కేంద్ర మంత్రి చేతుల మీదుగా బోటు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.


దత్తాత్రేయస్వామి ఆలయం

దృష్టి సారిస్తే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

వేములవాడ-కరీంనగర్ ప్రధాన రహదారిలోని కొదురుపాక చౌరస్తా నుంచి బోయినపల్లి మార్గంలో వరదవెల్లి ఆర్అండ్ఆర్ కాలనీ నుంచి జలాశయం బ్యాక్‌వాటర్ వరకు దారి ఉంటుంది. గుట్ట చుట్టూ ఎటు చూసినా కనుచూపు మేర నీళ్లు, గుట్ట చుట్టూ పచ్చదనం భక్తులను ఆకట్టుకుంటుంది. ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే వేములవాడలోని రాజన్న ఆలయానికి వచ్చే భక్తులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

నిత్య పూజలకు తొలగిన ఇబ్బందులు



బోటు అందుబాటులోకి రావడంతో గుట్టపై స్వామివారికి నిత్య పూజలు, అభిషేకాలు కొనసాగించడానికి ఇబ్బందులు తొలగనున్నాయి. బోటు ఏర్పాటుకు నిధులు కేటాయించిన కేంద్ర మంత్రి సంజయ్‌కి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసుకొని బోటు నిర్వహణపై చర్చించుకుంటాం. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంతోపాటు వంతెన నిర్మాణానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

- నాగుల శ్రీనివాస్, ఆలయ ఛైర్మన్

క్రీడలతో స్నేహభావం

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసంతోపాటు స్నేహభావం పెంపొందుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో రాజన్న సిరిసిల్ల ప్రీమియం సీజన్-2 కాంగ్రెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ గ్రామీణ యువతలో ఉన్న నైపుణ్యతను వెలికి తీయడానికి క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రీడలంటే ప్రత్యేక ఆసక్తితో వాలీబాల్ పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించానని ఆయన తెలిపారు. యువత కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడల పట్ల ఆసక్తి చూపించాలన్నారు. క్రీడల అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అంతకు ముందు క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు వెలుముల స్వరూప, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాయకులు యెల్లె లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మాని రాంలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు స్వరూప, కాంగ్రెస్ నాయకులు

ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని అంబేడ్కర్‌నగర్, సుందరయ్యనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఓపీ, సిబ్బంది రిజిస్టర్, రక్త పరీక్షల ల్యాబ్, ఐపీ గదులు, మందులను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. గత నెలలో ఎన్ని కాన్పులు అయ్యాయి, ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు, మందుల వివరాలను స్థానిక వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు వినియోగించుకునేలా అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కృష్ణవేణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్‌నగర్‌లో అర్బన్ పీహెచ్‌సీ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

అలంకారప్రాయంగా బస్తీ దవాఖానా

న్యూస్‌టుడే, వేములవాడ

పేద ప్రజలకు వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానా అలంకారప్రాయంగా మారింది. వేములవాడలోని రాజన్న దర్శనానికి వచ్చే భక్తులతోపాటు జాత్రగౌండ్ ప్రాంతంలోని ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏడాదిన్నర క్రితం ఆలయ లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌లో దీనిని ఏర్పాటు చేశారు. అన్ని వసతులు కల్పించి రెండు పడకలతో ప్రారంభించారు. ఇందులో ఒక వైద్యుడు, స్టాఫ్ నర్స్, హెల్పర్‌ను నియమించారు. ఆసుపత్రి ఏర్పాటు చేసినప్పటి నుంచి నామమాత్రంగానే రోగులు వస్తున్నారు. స్థానికులు మాత్రం రక్తపోటు, మధుమేహం, దగ్గు వంటి వాటికి మందుల కోసం వస్తున్నారు.

అరకొరగా మందులు

ఆసుపత్రికి వచ్చే రోగులే తక్కువగా ఉంటే మందులు కూడా అరకొరగానే సరఫరా అవుతున్నాయి.

ఏడాదికి లక్ష రూపాయల బడ్జెట్ పెట్టినప్పటికీ నిధులు విడుదల కావడం లేదు.

నామమాత్రంగా వైద్య సేవలు

- మందుల కోసం ఇండెంట్ పెట్టినప్పటికీ ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. ఒక వేళ వచ్చినా పూర్తి స్థాయిలో రావడం లేదు.
- ఆరు నెలల నుంచి అరకొరగానే మందులు వస్తున్నట్లు చెబుతున్నారు.
- ఆసుపత్రి ముందు భక్తులు, ఇతరులు వాహనాలు నిలుపుతున్నారు. దీనికి ఇరువైపులా రహదారులను ఆక్రమించి డబ్బాలు ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు.


వేములవాడలోని బస్తీ దవాఖానా

వారంలో ఈ రోజుల్లోనే...

వారంలో శనివారం ఆసుపత్రికి సెలవు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యుడు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. మిగతా రోజుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచి ఉంటుంది.

- రాజన్న ఆలయానికి రాత్రింబళ్లు భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా ఆదివారం సాయంత్రం వేములవాడకు వచ్చినవారు ఇక్కడ వసతి గదుల్లో బస చేసి సోమవారం స్వామివారిని దర్శించుకుంటారు. రాత్రి వేళ ఏదేని వైద్య సహాయం అవసరమైతే భక్తులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 24 గంటలూ వైద్య సేవలు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుని వైద్య సేవలను మరింత విస్తృత పరచాల్సిన అవసరం ఉంది.

ఉన్న మందులనే ఇస్తున్నాం



ఆసుపత్రికి పూర్తి స్థాయిలో మందులు రావడం లేదు. అరకొరగా సరఫరా అవుతున్నాయి. సిబ్బంది కూడా అంతంత మాత్రంగానే ఉన్నారు. రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. సోమ, శుక్రవారాల్లో దాదాపు 20 మంది వస్తున్నారు. **- రవీందర్, వైద్యుడు బస్తీ దవాఖానా, వేములవాడ**

అధికారులు ఆదేశించినా...



సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో పెద్దబోనాల ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు పూడ్చివేయాలని ఆదేశాలు జారీ చేసినా వాటి యజమానులు పట్టించుకోవడం లేదు. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. రాత్రి సమయంలో బావులు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయి. ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సిరిసిల్ల అర్బన్**



భారాస నాయకుల రాస్తారోకో

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాల రైతు భరోసాను చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ భారాస నాయకులు ధర్నా, రాస్తారోకోలు నిర్వహించారు. ఈ సందర్భంగా తంగళ్లపల్లి మండలంలోని మానేరు వంతెన వద్ద రోడ్డుపై బైఠాయించిన విషయాన్ని ఈ చిత్రంలో చూడవచ్చు.

- న్యూస్‌టుడే, సిరిసిల్ల గ్రామీణం

స్వామి వారిని దర్శించుకున్న ఎస్పీ దంపతులు

వేములవాడ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామిని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ దంపతులు ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా రాజన్నకు కోడె మొక్కులు చెల్లించారు. ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు వారికి వేదాశీర్వచనం ఇచ్చారు. పర్యవేక్షకుడు తిరుపతిరావు స్వామివారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ప్రొటోకాల్ ఏఈవో రమేశ్‌బాబు, పర్యవేక్షకుడు అశోక్, ఇన్‌ఛార్జి శివసాయి, పట్టణ సీఐ వీరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సన్న ధాన్యం మిల్లింగ్‌కు ససేమిరా

క్వింటాకు 67 శాతం బియ్యం ఇవ్వలేమంటున్న మిల్లర్లు

న్యూస్‌టుడే, హుజూరాబాద్

ఉమ్మడి జిల్లాలోని మిల్లర్లు సన్న ధాన్యం మిల్లింగ్‌కు ససేమిరా అంటున్నారు. క్వింటాకు 67 శాతం బియ్యం ఇవ్వలేమని చేతులెత్తేస్తున్నారు. మిల్లింగ్ నిబంధనలు సడలించి క్వింటాకు కొంత పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేస్తూ.. ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్‌కు తీసుకోమని స్పష్టం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతుండగా మిల్లర్ల మెలికతో సన్నధాన్యం సేకరణ చిక్కు సమస్యగా మారనుంది.

దిగుబడి ఇలా..

ఉమ్మడి జిల్లాలో వానాకాలం సీజన్‌లో 11.75 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. 20.59 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనాకొచ్చారు. ఇందుకోసం 1,360 కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈసారి 31 రకాల సన్నధాన్యాన్ని పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో మునుపెన్నడూ లేని విధంగా వానాకాలం సీజన్‌లో అత్యధిక శాతం సన్నాలు సాగు చేశారు. ఉమ్మడి జిల్లాలో 3,90,967 ఎకరాల్లో సన్నాలు సాగైంది. కరీంనగర్ జిల్లాలో 2,48,623 మెట్రిక్ టన్నులు, జగిత్యాలలో 1,72,150 మెట్రిక్ టన్నులు, పెద్దపల్లిలో 3.44 లక్షల మెట్రిక్ టన్నులు, రాజన్న సిరిసిల్లలో 28,457 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాకొచ్చారు. మొత్తంగా 7.93 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని ప్రత్యేక కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు అంతా సిద్ధం చేశారు. సన్నాలకు కేంద్రం క్వింటాకు రూ.2,320 మద్దతు ధర చెల్లిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ కలిపి రూ.2,820 చొప్పున కొనుగోలు చేయనుంది. దొడ్డు ధాన్యంతో వచ్చే బియ్యాన్ని ఎఫ్‌సీఐ (భారత ఆహార సంస్థ)కు వెళతాయి. కొనుగోలు కేంద్రాలకు వచ్చే సన్నధాన్యాన్ని మిల్లింగ్ చేశాక వచ్చే బియ్యాన్ని వచ్చే జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు, సంక్షేమ వసతి గృహాలకు ఉపయోగించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. కానీ సన్న ధాన్యం మిల్లింగ్‌కు మిల్లర్లు ససేమిరా అనడంతో ఈ సమస్య కొలిక్కి వచ్చిన తర్వాతే సన్నధాన్యం కొనుగోలు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. నిబంధనలు సడలించాలని రారైస్ మిల్లర్స్ అసోయేషన్ అధ్యక్షుడు తనుకు సురేశ్ తదితరులు కోరుతున్నారు.



ఇదీ సమస్య

- ✦ సాధారణంగా దొడ్డు రకం ధాన్యం మిల్లింగ్ చేస్తే క్వింటాకు 67 కిలోల బియ్యం వస్తాయి. అదే సన్న రకం ధాన్యం మిల్లింగ్ చేస్తే 57 కిలోలకు మించి బియ్యం రావని మిల్లర్లు అంటున్నారు.
- ✦ దొడ్డు, సన్నాలకు చెందిన ఏ రకం ధాన్యం మిల్లింగ్ చేసినా క్వింటాకు రూ.67 కిలోల బియ్యం సీఎంఆర్ కింద అప్పగించాలని ప్రభుత్వం అంటుందని చెబుతున్నారు.
- ✦ సన్నరకాలను తీసుకొని మిల్లింగ్ చేస్తే క్వింటాకు 10 కిలోల బియ్యం తక్కువగా వస్తుందని, ఈ లోటును ఎవరు భరిస్తారని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు.
- ✦ పైగా 17 శాతం తేమ ఉన్న సన్నరకం ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటే 20 రోజుల్లో రంగు మారిపోయే ప్రమాదం ఉందని, ఇవే బియ్యాన్ని మిల్లింగ్ చేస్తే బియ్యం తీసుకునే సమయంలో నాణ్యత లేదంటూ అధికారులు కొర్రీలు పెడితే తాము నష్టపోతామని వాపోతున్నారు.
- ✦ అందుకే తేమ నిబంధనను 17 నుంచి 14 శాతానికి తగ్గించాలని.. సన్న బియ్యం సరఫరాలో క్వింటాకు రూ.300 పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేస్తూ ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్‌కు తీసుకోమని స్పష్టం చేస్తున్నారు.
- ✦ క్వింటాకు ఎన్ని కిలోల బియ్యం వచ్చినా తీసుకునేలా నిబంధన సడలించాలని కోరుతున్నారు.
- ✦ దీంతోపాటు 20 ఏళ్లుగా మిల్లింగ్ ఛార్జీలు పెంచకపోవడంతో అనేక సమస్యల తమను వేధిస్తున్నాయని అంటున్నారు.
- ✦ రారైస్ క్వింటాకు రూ.30 చెల్లిస్తున్నారని, పెరిగిన విద్యుత్తు ఛార్జీలు, కార్మికుల కూలీలు కలిపితే తమకు అసలే గిట్టుబాటు కావడం లేదంటున్నారు.

సమగ్ర కుల గణనకు కార్యాచరణ

న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం

సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ బీసీ గణన చేపట్టేందుకు అధికార యంత్రాంగం కార్యాచరణకు సిద్ధమైంది. సర్వేకు సంబంధించిన విధి విధానాలు వెలువడగానే ప్రక్రియను ప్రారంభించనున్నారు. ప్రధానంగా వివిధ శాఖల సమన్వయంతో ముందుకెళ్లాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యాయులు మినహా ఇతర శాఖల సేవలను ఇందుకోసం వినియోగించనుంది.

వివిధ శాఖల సమన్వయం: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముందు బీసీ కుల గణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అనేక తర్జన, భర్జన అనంతరం సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ వివరాల గణనతోపాటు బీసీ కులగణన సర్వే చేయనున్నారు. నిరంతరం క్షేత్ర స్థాయిలో ఉండే ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మెప్మా ఉద్యోగులు, ఏఎన్ఎంలు, స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించనున్నారు. 150 ఇళ్లకు ఒక యూనిట్‌గా తీసుకొని సర్వే చేపట్టేందుకు బాధ్యతలు అప్పగించనున్నారు. గ్రామ, వార్డు స్థాయిలో సమగ్రంగా ఇది కొనసాగనుంది. కేంద్ర ప్రభుత్వం 2011లో నిర్వహించిన జనగణన తర్వాత ఈసారి కొత్త విధానంతో రూపకల్పన చేసి కుల గణనకు శ్రీకారం చుట్టనున్నారు. గతంలో భారాస ప్రభుత్వం సమగ్ర సర్వే చేసినా ఉపయోగం లేకుండా పోయింది. సర్వేను 60 రోజుల్లో పూర్తి చేయడం ద్వారా బీసీ గణనతోపాటు ఇతర వివరాలను వెలుగులోకి వచ్చే అవకాశముంది. ఉమ్మడి జిల్లా కేంద్రంగా తీసుకొని అవసరమైన పటాలు, వివరాలు సేకరించి సర్వే సిబ్బందికి అప్పగించనున్నారు.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది: కులగణనకు సంబంధించిన మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని, కలెక్టర్ల ఆదేశాల మేరకు కార్యక్రమం చేపడతామని అధికార వర్గాలు తెలిపాయి. ప్లానింగ్ శాఖ సర్వే కార్యక్రమం సమన్వయం చేస్తోంది.

ఎస్సారెస్పీ 12 గేట్ల ద్వారా నీటి విడుదల

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామ సాగర్ ప్రాజెక్టు 12 గేట్లను తెరచి 37,488 క్యూసెక్కుల నీటిని ఆదివారం సాయంత్రం గోదావరిలోకి విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 13,566 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఎగువన వర్షాలతో వరద పెరిగే అవకాశమున్నందున దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి అన్ని కాలువలు, ఎత్తిపోతలు, మిషన్ భగీరథ పథకానికి కలిపి ఇన్‌ఫ్లోతో సమానంగా ఔట్‌ఫ్లో కొనసాగిస్తున్నారు.

దిగువ మానేరు జలాశయం నుంచి..

తిమ్మాపూర్ : మధ్య మానేరు జలాశయం నుంచి ఎల్ఎండీకి ఇన్‌ఫ్లో వస్తుండడంతో నీటి పారుదల శాఖ అధికారులు ఆదివారం రెండు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఎల్ఎండీకి 4800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. రెండు గేట్లను ఒక అడుగు మేర ఎత్తి 4277 క్యూసెక్కులను వాగులోకి వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. జలాశయంలో ప్రస్తుతం 24.034 టీఎంసీల నీరున్నట్లు వారు చెప్పారు.

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టుకు క్రీడాకారుల ఎంపిక



సుడా ఛైర్మన్ నరేందర్‌రెడ్డితో క్రీడాకారులు

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నరేందర్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. స్పోర్ట్స్ విశ్వవిద్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.మహేందర్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా నుంచి 375 మంది బాలబాలికలు ఈ పోటీలకు హాజరయ్యారన్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈనెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కుమారస్వామి, ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం బాధ్యులు సూర్యప్రకాశ్, సంతోష్, మోయినుద్దీన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


అజరామరం.. ఆ త్యాగం

నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

న్యూస్‌టుడే, గోదావరిఖని

పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించుకోవడం వెనుక సైనికుల వీరోచిత పోరాటం దాగుంది. 1959 అక్టోబరు 21న భారత్-చైనా సరిహద్దున సియాచిన్ ప్రాంతంలోని భూ భాగాన్ని ఆక్రమించేందుకు చైనా రక్షణ బలగాలు యత్నించాయి. ఆ సమయంలో డీఎస్పీ కరమ్‌సింగ్ ఆధ్వర్యంలో పంజాబ్‌కు చెందిన 21 మంది జవాన్లు అక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. అక్సయ్‌చిన్ ప్రాంతంలోని హాట్‌స్ప్రింగ్ వద్ద జరిగిన పోరాటంలో పది మంది సీఆర్పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. వీరుల రక్తం పారిన ఆ ప్రదేశాన్ని పవిత్ర స్థలంగా భావించి ఏటా అన్ని రాష్ట్రాల పోలీసులు సందర్శించి నివాళులర్పిస్తున్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం అక్టోబరు 21ని పోలీసు అమరవీరుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలువురు పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారు.

'కనిపించే మూడు సింహాలు చట్టానికి, న్యాయానికి, ధర్మానికి ప్రతి రూపాలైతే కనిపించని నాలుగో సింహమేరా పోలీస్' అని అంటాడు ఓ సినిమాలో కథానాయకుడు.. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో ముందుంటున్న రక్షకభటుల త్యాగాలకు ఈ మాట చక్కగా నప్పుతుంది.. సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా నిద్రించడానికి కంటి మీద కునుకు లేకుండా సేవలందిస్తున్న పోలీసుల త్యాగం అజరామరం.. విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన అమరులను స్మరించుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యం..



ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రాణ త్యాగం



గోదావరిఖని ఏఆర్ సబ్ హెడ్‌క్వార్టర్‌లో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఎస్.సంజీవరెడ్డికి 1999 సెప్టెంబరు 20న మహాముత్తారం మండలంలో రీపోలింగ్ భద్రత విధులు అప్పగించారు. ముందస్తుగా వెళ్లి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉంది. సంజీవరెడ్డి ఇంట్లో శుభకార్యం ఉన్నా విధులపై నిబద్ధతతో తన బృందంతో వెళ్లారు. దొబ్బలపాడు వద్ద రోడ్డును తనిఖీ చేస్తుండగా మావోయిస్టులు మందుపాతర పేల్చారు. ఆ ఘటనలో సంజీవరెడ్డితో పాటు కానిస్టేబుళ్లు మీస రవీందర్, కె.బాపు, బి.లక్ష్మీరాజం మృతి చెందారు. ప్రశాంత పోలింగ్ లక్ష్యంగా బందోబస్తు విధులకు ధైర్యంగా వెళ్లిన సంజీవరెడ్డి సాహసాన్ని ఇప్పటికీ పోలీసులు గుర్తు చేసుకుంటారు.

ఉమ్మడి జిల్లాలో అమరులైన పోలీసులు
కరీంనగర్ 4
పెద్దపల్లి 5
జగిత్యాల 14
రాజన్న సిరిసిల్ల 8

ఆయన సేవలు చిరస్మరణీయం

మల్హర్ మండలం రుద్రారంలో బ్యాంకును దహనం చేసినట్లు సమాచారం రావడంతో 1993 జూన్ 14న కొయ్యూరు ఎస్ఐ ఎం.ఎ.సుభాన్ పోలీసు బృందంతో ట్రాక్టరులో బయల్దేరారు. సుభాష్‌నగర్ నుంచి ఎడ్లపల్లి వైపు వెళ్తుండగా కల్వర్టు వద్ద మావోయిస్టులు ల్యాండ్‌మైన్ పేల్చారు. ఈ ఘటనలో ఎస్ఐ సుభాన్‌తో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు దుర్మరణం చెందారు. సుభాన్ త్యాగానికి గుర్తుగా 2019 అక్టోబరు 21న కమాన్‌పూర్ ఠాణా ఎదురుగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇలాంటి పోలీసు త్యాగధనుల విగ్రహాలను ఉమ్మడి జిల్లాలోని పలు చోట్ల ఏర్పాటు చేసి వారి సేవలను స్మరించుకుంటున్నారు.



సుభాన్

■ జగిత్యాల జిల్లా హబ్సీపూర్ ప్రాంతంలో మావోయిస్టు దళం ఉందన్న సమాచారంతో 1991 సెప్టెంబరు 10న పోలీసు బృందం అక్కడికి చేరుకుంది. మావోయిస్టుల కాల్పుల్లో జగిత్యాల రూరల్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేసిన మోబిన్ అక్కడికక్కడే మృతి చెందారు.

మందుపాతరకు బలి

అది 1991 డిసెంబరు 19. హుస్నాబాద్ మండలం రామవరం. ఆర్టీసీ బస్సులో చోరీ జరిగిందన్న సమాచారంతో ఉదయం 9.30 గంటల ప్రాంతంలో సీఐ యాదగిరి, ఎస్ఐ జాన్‌విల్సన్ తమ బృందంతో కలిసి అక్కడికి చేరుకున్నారు. విచారణ పూర్తయిన తర్వాత ఆర్టీసీ బస్సులో తిరిగి హుస్నాబాద్ బయలుదేరారు. రామవరం సమీపంలో మావోయిస్టులు పేల్చిన మందుపాతరకు సీఐ యాదగిరి, ఎస్ఐ జాన్‌విల్సన్, సీఆర్పీఎఫ్ ఎస్ఐ కశ్మీరీలాల్‌తో పాటు ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు, అయిదుగురు ఆర్టీసీ అధికారులు, నలుగురు గ్రామస్థులు మృతి చెందారు. మరో 9 మంది కానిస్టేబుళ్లు గాయపడ్డారు.



జాన్‌విల్సన్



యాదగిరి

■ 1996 సెప్టెంబరు 7న రాత్రి రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్‌లోని టెలిఫోన్ ఎక్స్ఛేంజిని మావోయిస్టులు దహనం చేశారు. ఈ ఘటనపై విచారణ కోసం 8న ఉదయం కానిస్టేబుల్ కె.మోహన్‌రావు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మావోయిస్టులు ల్యాండ్‌మైన్ పేల్చారు. ఈ ఘటనలో ఆయనతో పాటు మరో కానిస్టేబుల్ ఎం.డి.నజీర్ ప్రాణాలు కోల్పోయారు.

సమాజ రక్షణలో సాంకేతిక దన్ను

■ అమరుల త్యాగాలు, ఎదురవుతున్న సవాళ్లతో పాఠాలు నేర్చిన పోలీసు శాఖ అనేక సంస్కరణలు అమలు చేస్తోంది.

■ శాంతిభద్రతల పరిరక్షణలో ఎదురవుతున్న ఒడుదొడుకులను తట్టుకునేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చింది.

■ ఎక్కడ ఎలాంటి ఘటన జరిగినా క్షణాల్లో సమాచారం అందేలా ఏర్పాట్లు చేసింది. ఇందు కోసం 100 డయల్‌ను వినియోగంలోకి తీసుకొచ్చింది.



పోలీసు యాప్స్, టోల్‌ఫ్రీ నెంబర్లు

■ సీసీ కెమెరాలు, ఫోన్ యాప్‌లు, టోల్‌ఫ్రీ నెంబర్లతో ప్రజల్లోకి వెళ్తున్న పోలీసు శాఖ ఎక్కడా ప్రాణ నష్టం లేకుండా ప్రజలకు సేవలందిస్తోంది.

■ కంట్రోల్ రూం నుంచే శాంతిభద్రతలను పర్యవేక్షించే స్థాయికి చేరుకుంది. మహిళలు, యువతులు, విద్యార్థినుల భద్రతకు స్మార్ట్‌ఫోన్లలో యాప్‌లు రూపొందించింది.

■ అవాంఛనీయ ఘటనలు జరిగినపుడు పెట్రో కార్, మొబైల్ పార్టీలు, 100 డయల్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకునేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకుంది.

■ స్వీయ భద్రతతో పాటు ప్రజలకు రక్షణ కల్పించడంలో పోలీసు శాఖ ప్రత్యేకత చాటుకుంటోంది.

ఇంటి స్థల వివాదం.. అన్నను హత్య చేసిన తమ్ముడు

మల్లాపూర్, న్యూస్‌టుడే: ఇంటి స్థల వివాదంలో అన్నను తమ్ముడు హతమార్చిన దారుణ ఘటన మల్లాపూర్ మండలం ఒబులాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒబులాపూర్ గ్రామానికి చెందిన పల్లెపు సాయిలు(34)తో అతడి తమ్ముడు చందుకు మధ్య కొన్నేళ్లుగా ఇంటి వద్ద స్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. పాత గొడవలను దృష్టిలో పెట్టుకొన్న తమ్ముడు అన్నను హతమార్చాలని పథకం రచించాడు. ఆదివారం మధ్యాహ్నం సాయిలు గోదావరి తీరంలో ఒంటరిగా ఉన్నట్లు తెలుసుకున్న చందు అక్కడికి చేరుకొని మెడపై తల్వార్‌తో దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాయిలు తల, మొండెం వేర్వేరుగా ఉన్నట్లు గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు చందు పరారీలో ఉండటంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. హత్యా ఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



సాయిలు

ఉపాధి లేక నేత కార్మికుడి ఆత్మహత్య



సంపత్

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: నాలుగు నెలలుగా పని లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని తీవ్ర మనస్తాపానికి గురై ఓ నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం సిరిసిల్లలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం బీవైనగర్‌కు చెందిన ఆడెపు సంపత్ (60), మాలతి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అందరికీ వివాహాలు చేశారు. చిన్న కొడుకు అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద ఓ గదిలో సంపత్, మాలతి ఉంటున్నారు. నాలుగు నెలలుగా ఉపాధి లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, పది రోజుల క్రితం మాలతి కుమార్తె ఇంటికి వెళ్లింది. చేయడానికి పని లేకపోవడంతో కుటుంబ పోషణ భారమై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కృష్ణ తెలిపారు.

నదిలో మునిగి సీతంపేట వాసి మృతి

జమ్మికుంట, న్యూస్‌టుడే: ఇల్లందకుంట మండలం సీతంపేటకు చెందిన పోతన వేణుగోపాల్(38) కర్ణాటకలోని రాయచూరు జిల్లాలో కృష్ణా నదిలో మునిగి మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. రాజేంద్రం-సరస్వతి దంపతుల కుమారుడు వేణుగోపాల్ ఈ నెల 17న దత్తాత్రేయస్వామిని దర్శించుకునేందుకు రాయచూరు వెళ్లాడు. కృష్ణానదిలో స్నానం చేసేందుకు దిగుతూ ప్రమాదవశాత్తు అందులో పడిపోయారు. నది పక్కనే బ్యాగు ఉండటంతో పరిసర ప్రాంతవాసులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు వచ్చి బ్యాగు వేణుగోపాల్‌దిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ నెల 19 ఘటనా స్థలానికి 40 కి.మీ దూరంలో జాలర్లకు వేణుగోపాల్ మృతదేహం కనిపించింది. వేణుగోపాల్ మృతితో గ్రామంలో విషాదం చోటు చేసుచేసుకుంది. ఆదివారం మృతదేహాన్ని సీతంపేటకు తీసుకుస్తున్నట్లు కుటుంబీకులు చెప్పారు.



వేణుగోపాల్

జూనియర్ అసిస్టెంట్ బలవన్మరణం



సంగీత

వీణవంక, న్యూస్‌టుడే: ఇప్పలపల్లి గ్రామానికి చెందిన గువ్వల సంగీత(33) ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డట్లు వీణవంక ఎస్ఐ తిరుపతి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సంగీత భర్త కొండయ్య పది సంవత్సరాల క్రితం మృతి చెందారు. వీరికి కూతురు కిరణ్మయి ఉంది. సంగీత నీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా చొప్పదండిలో విధులు నిర్వహిస్తున్నారు. రెండు నెలలుగా జ్వరంతో బాధ పడుతూ తీవ్ర అనారోగ్యానికి గురై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఆదివారం ఉదయం ఉరి వేసుకున్నారు. దీంతో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి కిరణ్మయి అనాథగా మారింది. మృతురాలి తల్లి మధునమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఠాణా ఎదుట ఆత్మహత్యాయత్నం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: చోరీ కేసులో అనుమానితుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన పెద్దపల్లి ఠాణా ఎదుట జరిగింది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. పురపాలిక మాజీ ఛైర్మన్ ఎలువాక రాజయ్య శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి బస్సులో వచ్చి పెద్దపల్లి కమాన్ వద్ద సన్నిహితుడి కోసం నిరీక్షిస్తున్నారు. ఈ క్రమంలో ఆటోలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు రాజయ్యపై దాడి చేసి అతడి చేతిలోని బ్యాగును లాక్కెళ్లారు. ఈలోగా అక్కడికి చేరుకున్న సన్నిహితుడితో కలిసి రాజయ్య ఆటోను వెంబడించారు. ఓ చోట వారిని పట్టుకునే యత్నంలో ఆటోను డ్రైవర్ వేగంగా వెనక్కి తిప్పి వెళ్లిపోయాడు. అందులో వెళ్తున్న వారు తలోవైపు పరుగు తీశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పెట్రోలింగ్ సిబ్బంది అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను ఠాణాకు తరలించారు. ఆదివారం ఉదయం ఆటో డ్రైవర్ రెహమాన్ అక్కడికి చేరుకొని.. రాత్రి జరిగిన ఘటనతో తనకు సంబంధం లేదంటూ ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో పోలీసులు అడ్డుకొన్నారు. ఈ విషయమై ఎస్సై లక్ష్మణ్‌రావును వివరణ కోరగా విచారణ జరుగుతున్న క్రమంలో పెట్రోల్ పోసుకొని కేసును తప్పు దారి పట్టించేందుకు యత్నించడం సరికాదన్నారు. మరోవైపు ఆదివారం ఉదయం రాజయ్య ఇంటి ముందు బ్యాగు ప్రత్యక్షం కావడం గమనార్హం.



రెహమాన్



కర్రల వంతెనపై కష్టాల యానం

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి నుంచి పోతారం వెళ్లే చెరువు వద్ద ఇటీవలి వర్షాలకు మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. ఇక్కడ వంతెన కోసం గతంలో నిధులు మంజూరు చేసినా గుత్తేదారు పనులు ప్రారంభించలేదు. దీంతో గ్రామస్థులు, వ్యవసాయదారులు, గొర్ల కాపరులు కర్రలతో ఇలా తాత్కాలిక వంతెనను ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై నుంచే వాహనదారులు రాకపోకలు సాగిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. వంతెనతో పాటు పూర్తి స్థాయిలో బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ముత్తారం

రాజన్న ఆలయ గోపురానికి బంగారు తాపడం

దేవాదాయ శాఖ అధికారుల ప్రణాళిక

న్యూస్‌టుడే, వేములవాడ

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ గోపురానికి బంగారు తాపడం చేయడానికి దేవాదాయ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఆలయానికి చెందిన బంగారు నిల్వలు గోపురానికి బంగారు తాపడం చేసేందుకు సరిపోతాయా? లేదా అనే అంశంపై సమీక్షించిన అనంతరం అధికారులు ఓ అంచనాకు రానున్నట్లు తెలుస్తోంది.

రాజన్నను దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. స్వామివారిని దర్శించుకున్నవారు వివిధ రకాల కానుకలను సమర్పిస్తారు. ఆలయంలో జరిగే ఉత్సవాల సందర్భంగా లక్షల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వీరిలో కొందరు బంగారం, మరి కొందరు వెండిని కానుకలుగా సమర్పిస్తుంటారు. ప్రస్తుతం ఆలయానికి చెందిన బంగారం 95 కిలోలు, వెండి 4,800 కిలోలు ఉంది. బంగారు తాపడంతో ఆలయానికి కొత్త శోభ సంతరించుకోనుంది.

గతంలోనే ప్రతిపాదన

రాజన్న ఆలయ గోపురానికి బంగారు తాపడం చేయాలని గతంలోనే ఆలయ అధికారులు, అప్పటి ఆలయ పాలకవర్గం ప్రతిపాదనలు చేసింది. ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానానికి నిధులు సమకూర్చారు. అయితే అంచనాలు పెరిగిపోవడంతో ఆ నిధులు సరిపోవని తిరిగి వెనక్కి పంపించారు. దీంతో అప్పటి నుంచి ఇది పెండింగ్‌లో ఉండిపోయింది.



రాజన్న ఆలయం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి



ఆలయ గోపురానికి బంగారు తాపడం చేసేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఎంత బంగారం అవసరమవుతుందనేది ముందుగా అంచనా వేస్తారు. ప్రస్తుతం ఆలయానికి ఉన్న బంగారం నిల్వల ప్రకారం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తరవాత బంగారు తాపడం ప్రక్రియ మొదలవుతుంది. **- వినోద్‌రెడ్డి, ఈవో, రాజన్న ఆలయం, వేములవాడ**

సహకారంతో అన్నీ సాధ్యమే

కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ రాజేశ్వర్‌రావు



జ్యోతి వెలిగించి భారతి రాష్ట్ర మహాసభలను ప్రారంభిస్తున్న కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ రాజేశ్వర్‌రావు

చింతకుంట (కరీంనగర్ కొత్తపల్లి), న్యూస్‌టుడే: సహకార సంఘాలు నిజాయతీ, నిబద్ధతతో పని చేయాలని, సహకారంతోనే ఏదైనా సాధించవచ్చని కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామంలో చింతకుంట సహకార సంఘం ఆధ్వర్యంలో సహకార భారతి తెలంగాణ శాఖ నాలుగో రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజేశ్వర్‌రావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో సహకార సంఘాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, వీటికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి చేయూత అందించాల్సిన అవసరముందన్నారు. సహకార భారతి రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సంఘం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తోందని, రాబోయే రోజుల్లో మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలో ప్రధాన వక్త ఆయాచితుల లక్ష్మణరావు, సహకార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు న్యాలమడుగు శంకరయ్య, జాతీయ కార్యదర్శి నందినిరాయ్, రాష్ట్ర నాయకులు కుమారస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, జిల్లా అధ్యక్షుడు తుమ్మల రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)
వీర్నపల్లి: 91541 18151
బోయినపల్లి: 84999 90001

న్యూస్‌టుడే, బోయినపల్లి

? విలాసాగర్ నుంచి కొదురుపాక రహదారి వెంబడి పలు చోట్ల ప్రమాదకరంగా గుంతలు ఉన్నాయి. వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. - శ్రీనివాస్, విలాసాగర్

✓ పంచాయతీరాజ్ రహదారి వెంబడి ప్రమాదకర గుంతలు పూడ్చివేస్తున్నాం. రహదారి పరిశీలించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం. - విష్ణువర్ధన్, పంచాయతీరాజ్ ఏఈ

సప్తాహ ప్రవచనాల నిర్వహణ అభినందనీయం

వేములవాడ, న్యూస్‌టుడే: శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచనాలు నిర్వహించడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు ఆధ్యాత్మిక భావం పెంపొందించడానికి దోహదపడతాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బ్రాహ్మీశ్రీ పవితక మేహమరాజ్ శర్మచే నిర్వహిస్తున్న శ్రీ మద్భాగవత సప్తాహ ప్రవచన కార్యక్రమాన్ని విప్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బింగి మహేష్, వివిధ పార్టీల నాయకులు, అర్చకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్, చిత్రంలో భాజపా జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

భాజపా సభ్యత్వ నమోదు

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా మండల ఇన్‌ఛార్జి కరివేద మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అగ్రగామిలో నిలుపుతున్నారని, ప్రతి ఒక్కరూ మోదీకి మద్దతుగా నిలవాలని కోరారు. ప్రధానిమోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేశారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు దెజెట్టి శ్రీనివాస్, నాగసముద్రాల సంతోష్, భూమల్ల అనిల్, కాట్నపల్లి రవీందర్, కోల సంతోష్, అమ్ముల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'నేతన్నలవి ప్రభుత్వ హత్యలే'

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్ల నేతన్నలవి గత, ప్రస్తుత ప్రభుత్వాల హత్యలేనని చేనేత పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి ఆరోపించారు. సిరిసిల్లలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన ఆవెపు సంపత్ అనే మరమగ్గాల కార్మికుడు ఉపాధి లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. మరమగ్గాల కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కార్మికులకు వెంటనే ఉపాధి అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

ఏజీపీకి సన్మానం


కృష్ణను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామానికి చెందిన న్యాయవాది పసుల కృష్ణ ప్రభుత్వ సహాయ ప్లీడర్‌గా నియమితులైన నేపథ్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయనను వేర్వేరుగా ఆదివారం ఘనంగా సన్మానించారు. పూలమాల, శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పందిర్ల లింగంగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు బాబు, వంగ గిరిధర్‌రెడ్డి, పందిర్ల శ్రీనివాస్‌గౌడ్, గోపాల్, తిరుపతి, వెంకటేశ్, సంతోష్, గంట అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత కక్షలతో ఆలయ అభివృద్ధికి ఆటంకం

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి ఆలయంపై గుత్తాధిపత్యం చెలాయించేందుకు కొందరు వ్యక్తిగత కక్షలతో ఆలయ పునర్నిర్మాణానికి అడ్డు తగులుతున్నారని భాజపా మండల ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కమిటీలో కొందరు బాధ్యులు ఆలయ పునర్నిర్మాణ ప్రక్రియ, ఆదాయం తదితర అంశాలను ప్రజల ముందు ఉంచాలన్నారు. ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని ముందుకు వచ్చే వారిపై కేసులు పెడతామంటూ బెదిరింపులకు పాల్పడుతూ కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు పారిపెల్లి సంజీవరెడ్డి, కిరణ్‌నాయక్, వంగ శ్రీకాంత్‌రెడ్డి, అంతేర్పుల తిరుపతి, దాసు, చందుపట్ల రాంరెడ్డి, నర్సయ్య, రాజిరెడ్డి, రాజేందర్‌రెడ్డి, మానుక రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

రాచర్ల బొప్పాపూర్ (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ముత్యాల మనోజ్, పి.రిషిక, సీహెచ్.సాహితి, ఎం.శ్రీహర్ష రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఎం.డి. అక్బర్ ఆదివారం తెలిపారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల వాలీబాల్ పోటీలను శనివారం నిర్వహించారన్నారు. జట్టుకు సారథ్యం వహించిన ముత్యాల మనోజ్ రాజన్న సిరిసిల్ల జిల్లా జట్టును మొదటి స్థానంలో నిలపడంలో కీలకపాత్ర పోషించాడని పేర్కొన్నారు. అలాగే విద్యార్థినులు పి.రిషిక, సీహెచ్.సాహితి, ఎం.శ్రీహర్ష జిల్లాను రెండో స్థానంలో నిలపడానికి తీవ్రంగా కృషి చేశారని తెలిపారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఈ నెల 28 నుంచి తలపెట్టే రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పీడీతోపాటు ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

పడకేసిన పారిశుద్ధ్యం

న్యూస్‌టుడే, సిరిసిల్ల అర్బన్

కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా పట్టణంలో ముందస్తు చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు పదే పదే చెబుతున్నా మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పెడచెవిన పెడుతున్నారు. దీంతో పారిశుద్ధ్య సమస్య నెలకొని ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అయినా పట్టించుకున్న నాథుడు లేడని స్థానికులు వాపోతున్నారు.

సిరిసిల్ల పట్టణంలోని శివనగర్‌లో కుసుమ రామయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణంలో భాగంగా ప్రధాన కాలువలో మట్టి పడి మూసుకుపోయింది.

- దాదాపు రెండు సంవత్సరాలు అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో మురుగు ప్రధాన రహదారులపై ప్రవహిస్తోంది. పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది.
- కాలువలో మట్టి ఉండటంతో మురుగు ముందుకు సాగడం లేదు. దీంతో దుర్గంధం వస్తోంది. ఇటు పాఠశాల విద్యార్థులు, అటు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.
- ఈగలు, దోమల బెడద విపరీతంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.
- కుసుమ రామయ్య ప్రభుత్వ పాఠశాలలో దాదాపు 500 మంది విద్యార్థులు చదువుతున్నారు.


కాలువలో ఇలా...


ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు

ఈ సమస్య కారణంగా దోమకాటుకు గురై జ్వరాల బారిన పడి ఆసుపత్రి పాలవుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రధాన కాలువలో మట్టిని తొలగించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, కాలనీవాసులు కోరుతున్నారు.

వెంటనే మట్టిని తొలగిస్తాం

పట్టణంలోని శివనగర్‌లో కుసుమ రామయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం సమయంలో ప్రధాన మురుగు కాలువలో దాదాపు 30 అడుగుల వరకు మట్టి పడి పూర్తిగా కాలువ మూసుకుపోయింది. పారిశుద్ధ్య కార్మికులకు చెప్పి జేసీబీ సహాయంతో ప్రధాన కాలువలోని మట్టిని వెంటనే తొలగిస్తాం.
- సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిరిసిల్ల

కాంగ్రెస్ హామీలపై నిలదీయండి

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీలపై రైతులు గ్రామాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని భారాస జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వర్షాకాలానికి రైతు భరోసా ఇవ్వకుండా రైతులను మోసం చేస్తుందన్నారు. ఎన్నికల ముందు రూ.35 వేల కోట్ల రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి కేవలం రూ.17 వేల కోట్లు చేశారని తెలిపారు. ఇంకా 70 శాతం మంది రైతులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి బస్తాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం సన్నరకానికి ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి తెలంగాణ అభివృద్ధి, రైతుల సంక్షేమం, విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. గుడులు, గోపురాలను సందర్శిస్తూ వారాలు లెక్క పెట్టుకోవడమే ఆయనకు సాధ్యమవుతుందన్నారు. ముందు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు మద్దతు తెలుపుతున్నట్లు ఆడుతున్న డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో భారాస నాయకులు కుంబాల మల్లారెడ్డి, రమణారావు, జీల కిషన్, రాజిరెడ్డి, మ్యాన రవి, బైరగోని శ్రీనివాస్, ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భారాస జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

ప్రజాపాలనను విమర్శించే హక్కు భారాసకు లేదు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: అధికారంలో ఉన్నప్పుడు వారు చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో చేసి చూపిస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు భారాసకు లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ డిక్లరేషన్ ప్రకారం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. అర్హులైన రైతులందరికీ రైతు భరోసాను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నర్సింగంగౌడ్, పర్శరాములు, బాలు, పెద్దూరు తిరుపతి, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఏం న్యాయం చేశారని నిరసనలు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఏం న్యాయం చేశారని భారాస శ్రేణులు ధర్నా, రాస్తారోకోలు చేస్తున్నాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ప్రశ్నించారు. ఎల్లారెడ్డిపేటలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత భారాస ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తామని రూ. లక్ష వరకు కూడా మాఫీ చేయలేక చేతులెత్తేసిందని విమర్శించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూడా విఫలమైందని ధ్వజమెత్తారు. రైతులకు మేలు చేసే వ్యవసాయ సంక్షేమ పథకాలను ఎత్తివేసి, ప్రజాధనాన్ని వృథా చేశారని విమర్శించారు. అర్హులైన అన్నదాతలకు భారాస చేసిందేమీలేదని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

నిధుల మంజూరుపై కాంగ్రెస్ సంబరాలు

రామన్నపేట (కోనరావుపేట), న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం రామన్నపేటలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రామన్నపేట గ్రామానికి తారు రోడ్డుతో పాటు పైవంతెన నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ నిధులు రూ.1.9 కోట్లు మంజూరు చేయటంపై గ్రామస్థులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గత పాలనలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలిగా కొనసాగిన అరుణ స్వగ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించలేదని మండిపడ్డారు. కొలనూర్ పీఏసీఎస్ డైరెక్టర్ నాగిరెడ్డి, నాయకులు నగేశ్, దేవరాజు, తిరుపతియాదవ్, లక్ష్మారెడ్డి, మల్లయ్య, నవీన్, రాజేందర్, కొమురయ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.


రామన్నపేటలో చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

చొప్పదండి ఎమ్మెల్యే పేరిట మిత్రమండలి ఏర్పాటు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేరిట ఎల్లారెడ్డిపేట మండలంలో ఆయనతో కలిసి చదువుకున్నవారు, మిత్రులు కలిసి 'సత్యమన్న మిత్ర మండలి'ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన సత్యం పుట్టి, పెరిగిన ప్రాంత అభివృద్ధి, నిరుపేదలకు ఆపన్నహస్తం అందించాలనే ఉద్దేశంతో సంఘం ఏర్పాటుపై తోటి మిత్రులతో సంప్రదింపులు జరిపారు. ఈ మేరకు 20 మంది సభ్యులతో స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి, వ్యవస్థాపక అధ్యక్షుడిగా రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ డైరెక్టర్ ముత్యాల సత్యనారాయణరెడ్డిని నియమించారు. ఉపాధ్యక్షులుగా నాయిని భాస్కర్‌రెడ్డి, రుద్రోజు భాస్కర్, చొక్కం భాస్కర్, గూడ అనిల్, ప్రధాన కార్యదర్శిగా ఒగ్గు బాలరాజుయాదవ్, కోశాధికారిగా శ్రీరామోజి దేవరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండలంలో నిరుపేద యువతుల వివాహంతోపాటు పేదలు ఎవరైనా మరణిస్తే వారికి రూ. 5 వేల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. ఆపదలో ఉన్న పేదలు సత్యమన్న మిత్రమండలి ప్రతినిధులను సంప్రదించాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కోనరావుపేట, న్యూస్‌టుడే: వానాకాలంలో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సయ్య కోరారు. కోనరావుపేట మండల కేంద్రంతో పాటు వెంకట్రావుపేట, కొండాపూర్, నిమ్మపల్లి, గొల్లపల్లి, శివంగళపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డైరెక్టర్లు, రైతులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి, సీఈవో కేశవులు, డైరెక్టర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డిపేట (గంభీరావుపేట): మండలంలోని మల్లారెడ్డిపేటలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ ఛైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోవద్దని, రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ రాజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, నాయకులు శెట్టి రవి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్, న్యూస్‌టుడే: పోత్గల్ సహకార సంఘం ఆధ్వర్యంలో ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు తన్నీరు బాపురావు ఆదివారం తెలిపారు. తెర్లుమద్ది, సేవాలాల్‌తండా, గన్నెవారిపల్లె, తుర్కపల్లె, రామలక్ష్మణపల్లె, కొండాపూర్, గూడూరు, మద్దికుంట, బందనకల్ గ్రామాల్లో ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు.

మూడో రోజూ కొనసాగిన దీక్షలు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ తాజా మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు దీక్షలో పాల్గొన్నారు. వీరికి బీఎస్పీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, మాజీ సర్పంచులు, బీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

చందుర్తి, న్యూస్‌టుడే: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఇందులో భాగంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం చందుర్తి మండలంలోని జోగాపూర్ గ్రామంలో పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు నాగం కుమార్, గొట్టె ప్రభాకర్, మ్యాకల గణేశ్, బొజ్జ మల్లేశం, కరకరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 29 రద్దుకు డిమాండ్

సుద్దాల (కోనరావుపేట), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం గ్రూపు-1 రీ నోటిఫికేషన్‌లో భాగంగా తెచ్చిన జీవో 29ను వెంటనే రద్దు చేయాలని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్ డిమాండు చేశారు. కోనరావుపేట మండలం సుద్దాలలో నిరుద్యోగులతో కలిసి ప్లకార్డులతో ఆదివారం ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీలు తీవ్రంగా నష్టపోతున్నట్లు ఆరోపించారు. శాంతియుతంగా నిరసన దీక్ష చేస్తున్న నిరుద్యోగులపై లాఠీఛార్జి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రవెల్లి సందీప్, రాజు, దొబ్బల అరుణ్, ప్రవీణ్, దిలీప్, ఎగదండి సుధీర్, టేకుమల్ల అక్షయ్, బొడ్డు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.


సుద్దాలలో నిరసన తెలుపుతున్న భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, తదితరులు

చెక్కుల పంపిణీ

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం పలువురికి ముఖ్యమంత్రి ఆర్థిక సాయం చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు. దాదాపు రూ.11,38,500 విలువ చేసే చెక్కులను 36 మంది లబ్ధిదారులకు స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ మహేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు రమేష్, సంగస్వామి, పుల్కం రాజు, రవీందర్, నాగభూషణం, సత్యలక్ష్మి, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం గోడపత్రిక ఆవిష్కరణ

వేములవాడ: పెద్దపల్లి జిల్లాలో వచ్చే నెల 3న జరిగే పెద్దపల్లి జిల్లా మున్నూరు కాపు సంఘం ఆత్మీయ సమ్మేళనం గోడపత్రికను పట్టణంలోని మున్నూరుకాపు సంఘం ఆవరణలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సదస్సుకు తరలిన ఏఈవోలు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్ మండలం తూముకుంటలో నిర్వహించే రాష్ట్రస్థాయి సదస్సుకు ఆదివారం జిల్లాలోని ఏఈవోలు తరలి వెళ్లారు. గత ఏడు సంవత్సరాలుగా ఏఈవోల సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేసినా ఎలాంటి స్పందన లేదని ఏఈవోల జేఏసీ అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు.

రాజన్న క్షేత్రానికి భక్తుల తాకిడి

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి నెలకొంది. స్వామి వారి దర్శనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ధర్మగుండం, పార్కింగ్ స్థలం భక్తులతో సందడిగా మారాయి. ఆలయ పార్కింగ్, వీఐపీ రోడ్లలో భారీ సంఖ్యలో వాహనాలను భక్తులు నిలిపారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు కుటుంబ సమేతంగా కోడె మొక్కులు చెల్లించుకున్నారు. పరివార దేవతలను దర్శించుకున్నారు. వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొని తరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, అధికారులు పర్యవేక్షణ చేశారు. దాదాపు 35 వేల మంది రాజన్నను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు బద్దిపోచమ్మను దర్శించుకొని బోనాల మొక్కులు చెల్లించుకున్నారు.


ఆలయ ప్రాంగణంలో భక్తులు

నిత్యాన్నదాన సత్రానికి విరాళం

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ నిత్యాన్నదాన సత్రానికి ఆదివారం వేములవాడకు చెందిన రాజ్‌కుమార్, స్నేహ దంపతులు రూ.31,116లను విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డికి చెక్కు అందజేశారు. అంతకు ముందు వీరు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


ఈవో వినోద్‌రెడ్డికి చెక్కు అందజేస్తున్న భక్తులు

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ కార్యవర్గం ఎన్నిక

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్లలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా పిట్టల దేవరాజు, ప్రధాన కార్యదర్శిగా అజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బంటు బాలకిషన్, పారం లక్ష్మీనారాయణ, సుల్తాన్ ఎల్లయ్య, కట్కూరి ముఖేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొండాపూర్ (ముస్తాబాద్), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో ఆదివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు... కొండాపూర్ గ్రామానికి చెందిన సర్దాని అజయ్ (24) మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కాంపౌండరుగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గత ఫిబ్రవరి 26న పని ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. నామాపూర్ శివారులో మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో హుటాహుటిన మండల కేంద్రంలో యువకుడు పని చేస్తున్న ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించారు. మెరుగైన వైద్యం కోసం సిద్దిపేటకు తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ పంపించారు. అక్కడ ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తండ్రి సర్దాని నందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.


అజయ్

దారి విషయంలో పరస్పరం దాడి.. ఇరువురిపై కేసు

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ భూమి దారి విషయంలో పరస్పరం దాడి చేసుకోగా ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మారుతి తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వేములవాడ గ్రామీణ మండలం జయవరం గ్రామానికి చెందిన ఎండ్రియాల లింబాద్రి, శ్రీనివాస్ కుటుంబానికి, అదే గ్రామానికి చెందిన ఎండ్రియాల బాపురావు, వేణు కుటుంబానికి గ్రామంలో పక్కపక్కనే వ్యవసాయ క్షేత్రాలు ఉన్నాయి. ఆదివారం దారి విషయంలో ఇరువురి కుటుంబ సభ్యుల మధ్య గొడవ తలెత్తి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో పలువురికి గాయాలు కాగా, ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేర వార్తలు

డబ్బులు వసూలు చేసిన వారిపై...

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: డబ్బులు వసూలు చేసిన విషయంలో ఇద్దరు విలేకరులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తంగళ్లపల్లి ఎస్సై రామ్మోహన్ తెలిపారు. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన బోయిని కనుకయ్య దుకాణం వద్ద వాహనంలో ఇనుప సామగ్రి లోడ్ చేస్తుండగా రిపోర్టర్లమని చెప్పి ఫొటో తీసి దుకాణ యజమానిని డబ్బులు డిమాండ్ చేశారన్నారు. దీంతో రూ.5 వేలు మాత్రమే ఉన్నాయని చెప్పి రూ.4,500 నగదు, రూ.500 ఫోన్ పే చేశాడని పేర్కొన్నారు. ఈ మధ్య మరో రూ.2 వేలు డిమాండ్ చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆంజనేయులు, శ్యామ్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.


వేములవాడలో నిరసన తెలుపుతున్న నాయకులు


చందుర్తిలో...


బోయినపల్లిలో...


కోనరావుపేటలో...


వేములవాడ అర్బన్ మండలంలో...

రైతు భరోసా విడుదల చేయాలని భారాస ఆందోళన

అన్నదాతలకు రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని కోరుతూ భారాస నాయకులు ఆదివారం జిల్లాలోని మండల కేంద్రాల్లో ఆందోళన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతులను మోసం చేస్తుందని, వెంటనే రైతు భరోసా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో భారాస నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే బృందం**


రుద్రంగిలో...

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని 2024-పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం జిల్లా కన్వీనర్ మల్లారపు పురుషోత్తం ఒక ప్రకటనలో కోరారు. 2024 మార్చి నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ, సంపాదిత సెలవు నగదు, జీపీఎల్ ఫైనల్ పేమెంట్ రాక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆరు నెలల క్రితమే పెండింగ్ బిల్లులు ఆమోదం పొందినప్పటికీ ఇంకా విరమణ పొందిన ఉద్యోగులకు అందకపోవడం విచారకరమని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అందించాలని కోరారు.

మత్తు పదార్థాలపై కళా ప్రదర్శన

మల్కపేట (కోనరావుపేట), న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం మల్కపేటలో తెలంగాణ సాంస్కృతిక కళామండలి సారథి పొత్తూరి రాజు ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై ఆదివారం కళా ప్రదర్శన నిర్వహించారు. డ్రగ్స్, తంబాకు, గంజాయి, పొగాకు తీసుకోవటంతో క్యాన్సర్, ఇతర అనారోగ్యం బారిన పడి అమూల్యమైన జీవితాలను పాడు చేసుకోవద్దని ఆట, పాటల ద్వారా అవగాహన కల్పించారు.